ప్రాజెక్టుల పరాధీనంపై
పోరుబాట

▸ మొదటిపేజీ తరువాయి...

ప్రకటించనున్నారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. ఈ ఐదు జిల్లాల్లోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్లు, డీసీసీబీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలను కూడా సమావేశానికి ఆహ్వానించారు. ఈ సమావేశంలోనే కేసీఆర్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నారు. ప్రధానంగా కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తే తెలంగాణకు జరిగే నష్టాలను వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో హైదరాబాద్ నగరానికి తాగునీటికి, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య తీర్చేందుకు ఇస్తున్న తాగునీటికి కూడా ఇబ్బంది అవుతుందని వివరించనున్నారు. ఈ నెల రెండో వారంలో నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. బహిరంగ సభకు పెద్ద ఎత్తున రైతులను తరలించేలా పార్టీ నాయకులకు సూచనలు చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి తెలంగాణ భవన్‌కు వస్తున్న కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయి.

తెలంగాణను కాపాడండి

- మాజీ మంత్రి పొన్నాల

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో కొచ్చిన 40 రోజులకే తెలంగాణకు నష్టం చేసే నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. యూటర్న్‌లు తీసుకొంటున్నదని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్లలో ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకొన్నారని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని మినిట్స్ రికార్డులు చూసి తెలుసుకోవాలని సూచించారు. 'తెలంగాణను ఈ అనుభవ రాహిత్య, అవగాహన లోప, అహంకార పూరిత ప్రభుత్వం నుంచి కాపాడండి' అని ఎక్స్‌వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

భువనగిరిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు

వనపర్తి జిల్లా కొత్తకోటలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులు

రేవంత్.. ఖబడ్దార్

- కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోం
- రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన బీఆర్‌ఎస్ శ్రేణుల ధర్నాలు
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం
- కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)/కొత్తకోట/సూర్యాపేట టౌన్/ భువనగిరి అర్బన్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ భగ్గుమన్నది. 14 ఏండ్లు పోరాడి తెలంగాణను సాధించి, పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌పై నోరుపారేసుకుంటే సహించబోమని పార్టీ శ్రేణులు హెచ్చరించాయి. సోమవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ జిల్లా, పట్టణ అధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, గంభీరావుపేటలో న్యాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు నేతృత్వంలో కార్యకర్తలు ధర్నా చేశారు. 'రేవంత్‌రెడ్డి ఖబడ్దార్.. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం.. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రోడ్డుపై దిష్టిబొమ్మలు దహనం చేశారు. సీఎం సీట్లో కూర్చున్నాననే సోయిలేకుండా రేవంత్ దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాలన చేతగాక, గ్యారెంటీలను అమలు చేసే దమ్ములేక కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్టు మొరుగుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా మాటలు మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని హితవుపలికారు. గంభీరావుపేటలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ.. 420 హామీలు అమలు చేస్తామని అసత్య ప్రచారంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, హామీలపై దృష్టి సారించకుండా గత ప్రభుత్వ పాలనపై ఆరోపణలు చేయడం సరికాదని హితవుపలికారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఒక్క పథకం కూడా సక్రమంగా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సూర్యాపేట, భువనగిరి జిల్లా కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపాయి. సీఎం రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి అసభ్యకర పదాలు వాడుతున్న రేవంత్ తీరు మార్చుకోవాలని నాయకులు హితవుపలికారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో యాదాద్రి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సూర్యాపేటలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. మాటలు జాగ్రత్త

- కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే సహించం
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత గ్యాదరి బాలమల్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేత గ్యాదరి బాలమల్లు హెచ్చరించారు. 60 ఏండ్ల తెలంగాణ కలను సాకారం చేసిన కేసీఆర్‌పై సీఎం హోదాలో ఉన్న వ్యక్తి పరుషపదజాలంతో మాట్లాడితే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలంగాణలోని ప్రతి రంగంపైనా కేసీఆర్‌కు పట్టు ఉన్నదని, దానిలో భాగంగానే నీటిపారుదల ప్రాజెక్టులను చేపట్టారని చెప్పారు. కానీ రేవంత్ విషయ పరిజ్ఞానం, కనీస అవగాహన లేకుండా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేఆర్‌ఎంబీపై ప్రజలకు అసత్యాలు వివరించేలా ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక, చేతకాక, వాటిని పక్కదారి పట్టించడానికి రేవంత్ తిట్ల దండకాన్ని అందుకున్నారని ఆరోపించారు.

గల్లీ నాయకుడిలా రేవంత్ మాటలు

- గుర్రాల నాగరాజు, బీఆర్‌ఎస్ సౌత్‌ఆఫ్రికా అధ్యక్షుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారు వ్యక్తిగత దూషణలు చేయడం తగదని బీఆర్‌ఎస్ సౌత్‌ఆఫ్రికా అధ్యక్షుడు గుర్రాల నాగరాజు పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తూ మన్ననలు పొందాలి గానీ, అదే పనిగా గల్లీ నాయకుడిలా దిగజారొద్దని రేవంత్‌కు సూచించారు. ఉద్యమనేత, పదేండ్లపాటు రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన కేసీఆర్ లాంటి వ్యక్తిపై నోటికొచ్చినట్టు మాట్లాడటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్‌కు కేవలం స్పీడ్ బ్రేకర్ లాంటివని పేర్కొన్నారు.

రేవంత్‌కు మతి భ్రమించింది: తుంగ బాలు

సీఎం హోదాలో హుందాగా వ్యవహరించాల్సిన రేవంత్ రెడ్డి.. చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు తుంగ బాలు ధ్వజమెత్తారు. సీఎం హోదాలో ఉంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు దుర్భాషలు చేయడం చూస్తే రేవంత్‌కు మతి భ్రమించినట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఆరు హామీల గడువుకు వందరోజులు సమీపిస్తున్న కొద్దీ ఏమీ చేయలేక, కేసీఆర్‌పై చిందులేస్తున్న విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలితే, ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రేవంత్ భాషపై అభ్యంతరం: రాధారపు సతీశ్‌కుమార్

రాష్ట్ర మొదటి సీఎం కేసీఆర్‌పై రేవంత్ వ్యక్తిగత దూషణలను మానుకోవాలని ఎన్నారై బీఆర్‌ఎస్ సెల్ బహ్రెయిన్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ సూచించారు. పాలన చేతగాక తెలంగాణను సాధించిన కేసీఆర్‌పై అనుచిత వ్యాక్యలు చేయడం సరికాదని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవని, అభివృద్ధిపై దృష్టి పెట్టి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, లేకుంటే ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

రేషన్‌కార్డు ఉంటేనే.. గృహజ్యోతి!

▸ మొదటిపేజీ తరువాయి...

విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్‌పీడీసీఎల్) పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం గృహ వినియోగ విద్యుత్తు కనెక్షన్లు 52 లక్షల వరకు ఉంటే అందులో సుమారు 30 లక్షలలోపు వినియోగదారులు 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగిస్తున్నట్టు సమాచారం. కాగా ఇప్పటికే ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 19 లక్షల మంది గృహజ్యోతి పథకం కోసం గ్రేటర్ పరిధిలో దరఖాస్తు చేసుకున్నారు. మిగతావారంతా అద్దెకు ఉంటున్నవారు, సొంతిల్లు లేనివారు ఉన్నారు. గ్రేటర్ పరిధిలో విద్యుత్తు శాఖ లెక్కల ప్రకారం 30 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలు చేయాలంటే ప్రతి నెలా సుమారు రూ.700 కోట్ల వరకు వ్యయం అవుతుంది.

ప్రజల్లో గందరగోళం

గృహజ్యోతి అమలుకు ప్రభుత్వం కచ్చితమైన మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయలేదు. దీంతో ప్రజల్లో అనేక అపోహలు ఏర్పడుతున్నాయి. రేషన్‌కార్డు ఉన్నవారికే గృహజ్యోతి అని అధికారవర్గాలు చెప్తున్నాయి. అయితే, హైదరాబాద్‌లో ఉంటున్న చాలామందికి తమ సొంత ఊర్లలో రేషన్ కార్డులు ఉన్నాయి. వారికి ఉచిత కరెంటు ఎక్కడ ఇస్తారన్నదానిపై స్పష్టత లేదు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా కొన్ని లక్షల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకొన్నారు. వాటి గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. కొత్త కార్డులు ఇస్తారా? ఇవ్వరా? ఇస్తే ఎప్పటిలోగా ఇస్తారు? కార్డుల జారీకి మళ్లీ ఏదైనా కార్యక్రమం చేపడుతారా? ఇప్పటికే సమర్పించిన దరఖాస్తులు సరిపోతాయా? అన్నదానిపై ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పష్టత రావటం లేదు. ఇప్పుడు గృహజ్యోతి పథకం అమలుచేస్తే ముఖ్యంగా గ్రామాల నుంచి బతుకుదెరువుకోసం వచ్చిన అద్దె ఇండ్లల్లో ఉంటున్నవారి పరిస్థితి ఏమిటన్నదానిపై కూడా స్పష్టత కరువైంది. మరోవైపు హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు అనేక ప్రాంతాల నుంచి వచ్చిన పనిచేసుకొంటున్నవారున్నారు. వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తారా? లేదా తెలంగాణవారికే ఇస్తారా? అనేదానిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వటంలేదు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి గృహజ్యోతి పథకంపై ప్రకటన చేస్తారని, అందులో అన్ని వివరాలు ఉంటాయని విద్యుత్తు శాఖ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఒక సందేశం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది.

ఉత్తమ్.. మళ్లీ అదే పాట!

- సీఎం చెప్పిందే మళ్లీ చెప్పిన మంత్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల అప్పగింతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఒకే విషయాన్ని పదేపదే చెప్తున్నారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆదివారం సీఎం చెప్పిన విషయాన్నే మళ్లీ చెప్పుకొచ్చారు. ప్రాజెక్టులు అప్పగించాలన్న నిర్ణయం తమది కాదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆ ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. అంతలోనే మళ్లీ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేది లేదని తేల్చిచెప్పారు. 2015 నుంచి కేఆర్‌ఎంబీ సమావేశాల్లో ఏమేం జరిగిందో వివరించారు తప్పితే 2014కు ముందు కేంద్రంలోని యూపీఏ, రాష్ట్రంలోని కాంగ్రెస్ హయాంలో జరిగిన ఒప్పందాల గురించి కానీ, విభజన చట్టంలో చేర్చిన అంశాల గురించి కానీ ఎక్కడా మాట్లాడలేదు. కేసీఆర్, జగన్ పదేపదే చర్చలు జరుపుతూ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. గత బడ్జెట్‌లో కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీకి మూడు ప్రాజెక్టులు అప్పగించేందుకు రూ. 200 కోట్లు కేటాయించారని తెలిపారు. మరి ఈ నిధులను గత ప్రభుత్వం వినియోగించిందా? లేదా? అన్న ప్రశ్నకు మాత్రం మంత్రి సమాధానం దాటవేశారు.

కేఆర్‌ఎంబీ చైర్మన్ శివనందన్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు

అన్ని ఔట్‌లెట్లపై సీఆర్పీఎఫ్‌ను పెట్టాలి

- ప్రాజెక్టుల స్వాధీన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- కేఆర్‌ఎంబీ కార్యాలయాన్ని విజయవాడలోనే పెట్టాలి
- ఆంధ్రప్రదేశ్ రైతుల నీటి హక్కులను కాపాడాలి
- ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెంకట గోపాలకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులపైనే కాకుండా వాటి పరిధిలోని అన్ని ఔట్‌లెట్లపై సీఆర్పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రైతుల నీటి హక్కులను కాపాడాలని, ఆ రాష్ట్రంలోని చివరి ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) కార్యాలయాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయవాడలోనే పెట్టాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సమాఖ్య ప్రతినిధులతో కేఆర్‌ఎంబీ చైర్మన్ శివనందన్ కుమార్‌ను ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ ఆధీనంలోకి తీసుకోవాలన్న కేంద్ర జల్‌శక్తి శాఖ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేయడం తగదని పేర్కొన్నారు. కేఆర్‌ఎంబీ కార్యాలయాన్ని విశాఖపట్నంకు తరలించాలని వైసీపీ ప్రభుత్వం చూస్తున్నదని ధ్వజమెత్తారు. దానివల్ల కృష్ణా బేసిన్‌లోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతోపాటు జల వనరుల శాఖ అధికారులకూ ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. కేఆర్‌ఎంబీ కార్యాలయాన్ని గోదావరి బేసిన్‌కు ఆవల ఉన్న విశాఖపట్నంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కృష్ణా డెల్టాకు 400 కి.మీ, ఎన్‌ఎస్‌పీకి 700 కి.మీ, శ్రీశైలానికి 800 కి.మీ. దూరంలో బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సహేతుకం కాదని, విజయవాడలో ఏర్పాటు చేయడమే అన్నివిధాలా సముచితమని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యవర్గ సభ్యులు గుడిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు అప్పగిస్తే ఊరుకోం

- దీనిపై కేంద్రం పునరాలోచించాలి
- బడ్జెట్‌లో సాగుకు మొండిచేయి
- జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఎందుకు ఇవ్వలేదు?
- లోక్‌సభలో బీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదిపై ఉన్న నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి సాగునీటి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తే చూస్తూ ఊరుకోబోమని లోక్‌సభలో బీఆర్‌ఎస్ నేత నామా నాగేశ్వరరావు పార్లమెంటు వేదికగా హెచ్చరించారు. ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడం వల్ల తెలంగాణకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని, దీనిపై పునరాలోచన చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా నామా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కులకు నష్టం కలిగించే ఏ అంశాన్నీ అంగీకరించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం, కష్టం కలిగే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ హక్కులు కాపాడేందుకు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు.

బడ్జెట్‌లో సాగుకు మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి, రైతులకు మొండిచేయి చూపించారని నామా విమర్శించారు. బడ్జెట్‌లో కనీస మద్దతు ధర అమలు ప్రస్తావనే లేకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందారని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సాయాన్ని పెంచకపోవడంతో రైతులపై కేంద్రానికి ఉన్న ప్రేమ ఏమిటో స్పష్టమైందని ఎద్దేవా చేశారు. 2022-23 నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని చెప్పుకున్న కేంద్రం ఈ బడ్జెట్‌లో ఒక్కమాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. కానీ తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసిందని వివరించారు.

జిల్లాల్లో నవోదయ విద్యాలయం ఎక్కడ?

విభజన హామీల అమలులో కేంద్రం తెలంగాణ పట్ల తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నదని నామా ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా, తొమ్మిది జిల్లాలకు మాత్రమే నవోదయ విద్యాలయాలు ఏర్పాటుచేశారని దుయ్యబట్టారు. జిల్లాకు ఒక నవోదయను ఎందుకు మంజూరు చేయాలేదో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, జిల్లాల్లో నవోదయ విద్యాలయం వంటి విభజన హామీల కోసం పెద్ద ఎత్తున పోరాడామని గుర్తుచేశారు. దేశంలోనే అత్యధిక స్థాయిలో తెలంగాణలో ఆయిల్‌పాం పంట సాగవుతున్నదని, కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

కేసీఆర్‌ను తిరగనివ్వం

▸ మొదటిపేజీ తరువాయి...

జరిగితే తమకు గానీ, ప్రభుత్వానికి గానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని, ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలేదని ఆరోపించారు. రూ. 2 లక్షల కోట్లతో కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టారని ఆరోపించారు. గజ్వేల్ లోని కేసీఆర్ ఫామ్ హౌస్‌కు మాత్రమే నీళ్లు వచ్చాయని, కాళేశ్వరంతో కొత్తగా ఆయకట్టు పెరగలేదని విమర్శించారు. మేడిగడ్డ ఇప్పటికే కుంగిపోయిందని, త్వరలోనే సుందిళ్ల, అన్నారం కూడా కూలిపోతాయని, హరీశ్‌రావు జైలుకు పోక తప్పదని జోస్యం చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టు అక్రమాల విషయంలో కేసీఆర్‌పై కేసులు నమోదు అవుతాయని తెలిపారు. కవితను కేసుల నుంచి తప్పించేందుకు కేంద్రంతో కేసీఆర్ కుమ్మక్కై పాజెక్టులు అప్పగించారని ఆరోపించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్‌తోనూ దోచుకున్నారని, జగదీశ్‌రెడ్డి సంగతి కూడా తేలుతుందని పేర్కొన్నారు. కాళేశ్వరం కంటే ముందు చేపట్టిన డిండి ప్రాజెక్టను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జగన్‌తో కుమ్మక్కై రాయలసీమ జల దోపిడీకి సహకరించి, రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే జనం బీఆరెస్‌ను చావగొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, నల్లగొండ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ కూడా రాదని జోస్యం చెప్పారు. డిపాజిట్ వస్తే తన పేరు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాదని సవాలు విసిరారు.

నల్లగొండపై పోలీసు చట్టం!

- కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై కాంగ్రెస్ కుప్పిగంతులు
- నల్లగొండలో భారీసభకు బీఆర్‌ఎస్ యోచన
- కాంగ్రెస్ సర్కారులో మొదలైన అలజడి
- సభను అడ్డుకునేందుకు 30, 30(ఏ) పోలీస్ యాక్ట్?
- బస్సులు ఇవ్వొద్దని ఆర్టీసీకి మౌఖిక ఆదేశాలు!



నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ సర్కార్‌లో అలజడి మొదలైందా? బీఆర్‌ఎస్ వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక, ప్రజలకు వివరణ ఇచ్చుకోలేక ఆంక్షల కుట్రలకు తెరలేపిందా? ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టేందుకు నల్లగొండలో బీఆర్‌ఎస్ నిర్వహించాలనుకున్న సభను అడ్డుకోవాలనుకుంటున్నదా? జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే ఈ అనుమానాలే కలుగుతున్నాయి. నల్లగొండకు కేసీఆర్ వస్తే ప్రజలు రోడ్లపైనే ఆపేస్తారని, ఆ తర్వాత జరిగే పరిణామాలకు తమ ప్రభుత్వం బాధ్యత వహించదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండలో హెచ్చరించారు. ఆయన హెచ్చరికల అనంతరం నల్లగొండ జిల్లాలో 30,30(ఏ) యాక్ట్‌ను అమలులో పోలీసు అధికారులు ప్రకటించారు. ఒకవేళ బీఆర్‌ఎస్ సభ నిర్వహిస్తే ఆ సభకు ఆర్టీసీ బస్సులు ఇవ్వొద్దని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు చర్చ జరుగుతుంది. శ్రీశైలంతో పాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్‌ఎంబీ పరిధిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ సర్కార్ ఒప్పుకున్నది. ఈ రెండు ప్రాజెక్టులు నిర్వహణ బోర్డు పరిధిలోకి వెళ్తే తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బీఆర్‌ఎస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. కాంగ్రెస్ సర్కార్ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా నల్లగొండ కేంద్రంగా భారీ బహిరంగసభను పెట్టి ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ భావిస్తున్నది. అలా బీఆర్‌ఎస్ నల్లగొండ సభపై ఆలోచన చేసిందో లేదో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. దీనికి కొనసాగింపుగా సోమవారం నల్లగొండ జిల్లాలో పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీఎం ఆఫీస్ డైరెక్షన్ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ప్రెస్‌మీట్ నిర్వహించి అడ్డగోలు, అసంబద్ధ ఆరోపణలు చేశారు.

అమలులోకి 30, 30(ఏ)యాక్ట్

నల్లగొండ జిల్లాలో నెల రోజుల పాటు 30,30(ఏ) పోలీస్ యాక్ట్-1861ను అమలు చేస్తున్నట్టు పోలీసులు ప్రకటించారు. ఈ చట్టం ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకో వంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని పేర్కొన్నారు. ఇలాంటి చట్టం గతంలో జిల్లాలో ప్రత్యేక సందర్భాల్లో మినహా సాధారణ సమయాల్లో అమలు చేసింది లేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో సమస్యాత్మక పరిణామాలు ఏమీ లేకపోయినా ఈ యాక్ట్‌ను అమలులోకి తేవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలో కృష్ణా జలాలపై బీఆర్‌ఎస్ తలపెట్టిన బహిరంగ సభ నేపథ్యంలోనే ఈ యాక్ట్ అమలును ప్రకటించారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయమై ఎస్పీ చందనాదీప్తి స్పందిస్తూ ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నదే ఈ యాక్ట్ ఉద్దేశమని చెప్పారు. ఇది సాధారణంగా ప్రతీ నెలా అమలు చేసే యాక్ట్‌నేనని పేర్కొన్నారు. ఇందులో ప్రత్యేకత ఏమీ లేదంటూ వివరణ ఇచ్చారు.

బస్సులు ఇవ్వొద్దంటూ..

నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ బహిరంగ సభ నిర్వహిస్తే దానికి జనం తరలిరాకుండా అడ్డుకునే ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ సర్కార్ మొదలుపెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు ఇవ్వొద్దని సోమవారం ముందస్తు సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. బీఆర్‌ఎస్ సభ తేదీ, స్థలం ఖరారయ్యాక సర్కార్ ఆంక్షలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ శ్రీదేవి స్పందిస్తూ మహాలక్ష్మి ప్రయాణాల రద్దీ నేపథ్యంలో శుభకార్యాలు, ప్రత్యేక కార్యక్రమాలకు బస్సులు ఇవ్వవద్దని 15 రోజుల క్రితమే తమకు ఆదేశాలు వచ్చినట్టు తెలిపారు. తాజాగా ఎలాంటి ఆదేశాలు లేవని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేత వేధింపులతో రైతు ఆత్మహత్యాయత్నం

- రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్ల పల్లిలో ఘటన

చికిత్స పొందుతున్న రైతు పెర్మాల్‌రెడ్డి

షాద్‌నగర్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ నాయకుడి వేధింపులతో ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్లపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పెర్మాల్‌రెడ్డి వ్యవసాయ పొలంలో బోరుబావి విద్యుత్తు కనెక్షన్ కోసం నెల రోజుల క్రితం డీడీ కట్టారు. అయితే.. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్ విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకుండా అధికారులను అడ్డుకుంటూ పెర్మాల్‌రెడ్డిని మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపం చెందిన పెర్మాల్‌రెడ్డి ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. తమ కుటుంబాన్ని వేధిస్తున్న గోవర్ధన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య అధికారులను వేడుకుంటున్నది. గ్రామంలో కొందరి రాజకీయ ఒత్తిళ్ల వల్ల పెర్మాల్‌రెడ్డి ఆత్మహత్యకు యత్నించాడని విద్యుత్తు అధికారులు చెప్పడం గమనార్హం. దవాఖానలో చికిత్స పొందుతున్న పెర్మాల్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించి బాధితుడు త్వరగా కోలుకునేలా చొరవ చూపాలని వైద్యులకు సూచించారు.